

రజక సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

# మేం తప్పులు చేయం.. విద్యార్థులను తీర్చిదిద్దుతున్నం

### సీఎంఆర్ ఘటనపై మాజీ మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్, జనవరి 5: మేం తప్పులు చేయం, విద్యా సంస్థలను స్థాపించి పేద, మధ్య తరగతికి చెందిన విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్నామని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ గిర్మాపూర్‌లో ఆదివారం జరిగిన మల్లన్న జాతరకు విచ్చేసిన సందర్భంగా ఆయన సీఎంఆర్ ఘటనపై స్పందిస్తూ సీఎంఆర్ విషయమై మీడియాలో రక రకాలుగా ప్రచారం చేయడం బాధాకరమన్నారు. తమ విద్యా సంస్థల ద్వారా ఉన్నతంగా సేవలందిస్తున్నామని తెలిపారు. 37 ఏండ్లుగా ఎంతో మందిని ప్రపంచ శ్రేణి ఇంజినీర్లు, డాక్టర్లు, ఫార్మాసిస్టులుగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. 10 వేల బోధన, బోధనేతర సిబ్బందికి ఉపాధి కల్పిస్తున్నామని తెలిపారు. మేం ఎప్పుడు తప్పులు చేయం, తెలియకుండా తప్పు జరిగితే కూడా బాధ్యత వహించి, తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కొంత మంది టీఆర్‌పీ రేటింగ్ కోసం సీఎంఆర్ ప్రతిష్టను డ్యామేజ్ చేసేలా వార్తలను ప్రసారం చేస్తున్నారని పేర్కొన్నారు. అలాంటి సంస్థలు ఎక్కువ కాలం నిలవవని అన్నారు.

#### జీవితం ప్రజా సేవకే అంకితం

తన జీవితం ప్రజా సేవకే అంకితం అని ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ గిర్మాపూర్‌లో సొంత నిధులతో నిర్మించిన ముదిరాజ్, రజక సంఘాల భవనాలను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ, మంత్రిగా పని చేసే ఐదేళ్ల కాలంలో నియోజకవర్గంలోని 61 గ్రామాలను ప్రభుత్వ, సొంత నిధులతో అందంగా తీర్చిదిద్దానని తెలిపారు. అన్ని కుల సంఘాలు, 120 ఆలయాల అభివృద్ధికి సొంత నిధులు ఇచ్చినట్టు, రోడ్లను అభివృద్ధి చేసినట్టు తెలిపారు. తన సేవలను గుర్తించిన నియోజకవర్గ ప్రజలు మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించారని, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఇక ముందు కూడా ప్రజా సేవలోనే ఉంటారని అన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు భాస్కర్ యాదవ్, మండల అధ్యక్షుడు దయానంద్ యాదవ్, నాయకులు సురేశ్ రెడ్డి, రణదీప్ రెడ్డి, రాజిరెడ్డి, జగన్ రెడ్డి, నవీన్ రెడ్డి, నాగరాజు, భద్రారెడ్డి పాల్గొన్నారు.




ఘట్‌కేసర్ మండలంలో జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడుతున్న మాజీ స్పీకర్ మధుసూదనాచారి

## బీసీలు రాజ్యాధికారం కోసం ఐక్యం కావాలి

### మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి

ఘట్‌కేసర్, జనవరి 5: బీసీలకు రాజ్యాధికారం రావాలంటే ప్రతి ఒక్కరు ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా ఎదిగినప్పుడే సాధ్యం అవుతుందని మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి అన్నారు. ఘట్‌కేసర్ మండల పరిధిలోని జేకే కన్వెన్షన్‌లో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు ఆధ్వర్యంలో 'పంచాయతీ ఎన్నికలు–బీసీల పాత్ర'పై ఆదివారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి బీసీలు ఓటర్లుగానే మిగిలారని, అధికారంలోకి రానియ్యకుండా అగ్రకులాలు అడ్డుకున్నారని చెప్పారు. బీసీలు రాజ్యాధికారం సాధించాలంటే ఎన్నో సమస్యలు ఎదుర్కోవలసి వచ్చేదన్నారు. రానున్న సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో బీసీలు రంగంలోకి దిగి అధికారాన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలు రంగంలోకి దిగి రాజ్యాధికారం సాధించేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. సంఘ సంస్కర్తలు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలకు భారత రత్న ఇవ్వాలని సభలో తీర్మానించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలు ఎటువంటి వ్యూహ రచనలు చేసి గెలుపొందాలి, రాజ్యాధికారం సాధించడానికి ఎంచుకోవలసిన మార్గ నిర్దేశాలను వివరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చింతపండు నవీన్, మోత్కుపల్లి నర్సింహులు, చెరుకు సుధాకర్, రిటైర్డ్ ఐఏఎస్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## పిట్టల శ్రీశైలానికి అభ్యుదయ రైతు అవార్డు



అభ్యుదయ రైతు అవార్డు అందుకుంటున్న పిట్టల శ్రీశైలం

ఘట్‌కేసర్, డిసెంబర్ 5: ప్రకృతి సిద్ధంగా లాభదాయకమైన ఆర్గానిక్ పంటలు పండిస్తున్న ప్రకృతి సేద్య రైతు పిట్టల శ్రీశైలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చం నాయుడు చేతుల మీదుగా ఆదివారం అభ్యుదయ రైతు అవార్డు అందుకున్నారు. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుషాపూర్ గ్రామానికి చెందిన ప్రకృతి సేద్య రైతు పిట్టల శ్రీశైలం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్శిటీ క్యాంపస్ ఆవరణలో విజ్ఞాన్ యూనివర్శిటీ, రైతు నేస్తం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన అభ్యుదయ రైతు పురస్కారంలో భాగంగా ఈ అవార్డును అందుకున్నారు. వ్యవసాయం దండగ అని వలసలు పోతున్న రైతులకు ఆరోగ్యంతో పాటు ఎకరాకు నెలకు రూ.30 వేలు ఆదాయం పొందవచ్చని నిరూపించిన పిట్టల శ్రీశైలానికి ఈ అవార్డు దక్కింది. ప్రకృతి సేద్య రైతు పిట్టల శ్రీశైలంను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చం నాయుడుతో పాటు నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, విజ్ఞాన్ యూనివర్శిటీ చైర్మన్ లావు రత్తయ్య, రైతు నేస్తం చైర్మన్ పద్మశ్రీ ఎడవల్లి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా అందుకున్నారు. ప్రతి రైతు ప్రజల ఆరోగ్య పరిరక్షణతో పాటు లాభదాయకమైన పంటలు పండించేలా శిక్షణ యిచ్చి ప్రోత్సహించనున్నట్లు శ్రీశైలం తెలిపారు.

# బ్రాహ్మణులకు అండగా నిలబడతా..

### ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును కలిసిన బ్రాహ్మణ సంఘాల అపరకర్మల భవన నూతన కార్యవర్గ సభ్యులుళ

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 5: సమాజంలోని బ్రాహ్మణులకు అండగా ఉండి ఎల్లప్పుడు సేవలందిస్తానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావును బ్రాహ్మణ సంఘాల అపరకర్మల భవన నూతన కార్యవర్గ సభ్యులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించగా, నూతన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే సన్మానం చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో బ్రాహ్మణుల అభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. కూకట్‌పల్లిలో నివసించే బ్రాహ్మణుల కోసం కేపీహెచ్‌బీ కాలనీలో అపరకర్మల భవనం నిర్మించడంతో పాటు అన్ని రకాల వసతులు కల్పించినట్లు తెలిపారు. సమాజంలోని పేద బ్రాహ్మణులకు ఎల్లప్పుడు అండగా ఉంటానని, వారి అభివృద్ధికి సేవలందిస్తానని తెలిపారు.

#### అపరకర్మల భవనం - నూతన కార్యవర్గం

బ్రాహ్మణ సంఘాల అపరకర్మల భవనం గౌరవ అధ్యక్షుడిగా కాండూరి నరేంద్రాచార్య, అధ్యక్షుడిగా వెంకటప్రగడ వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శిగా ఆదుర్తి పంచగంగేశ్వర్లు ఎన్నికయ్యారు. కమిటీ కోశాధికారిగా నేమాని సూర్యనారాయణ మూర్తి, ఉపాధ్యక్షులుగా రామరాజు ప్రతాప్ కుమార్, తూండ్ల కమలాకర్ శర్మ, సీవీ రావు, సుశీల, రాజగోపాల్, కోదండ రామయ్య, గోపాలరత్నం, శేషగిరి, రామాన్, నరసింహాచార్యులు, సాయి, మైలవరపు భాస్కర్, కార్యవర్గ సభ్యులుగా గరికపాటి రమాదేవి, అనితశ్రీపాల్, సీహెచ్ రమాదేవి, కన్నలతలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ, బ్రాహ్మణులను సంఘటితం చేసి, పేదల అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అపరకర్మల భవనం నిర్మాణంలో ఎమ్మెల్యే అందించిన సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో పలువురు బ్రాహ్మణ సంఘం నేతలు పాల్గొన్నారు.

## సగరుల అభ్యున్నతికి కృషి

బాలానగర్, జనవరి 5: సగరులకు అండగా ఉంటానని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బాలానగర్ సగర సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సగర సంఘం వారు ఎల్లప్పుడు తనకు అండగా ఉంటారని, సగరులకు ఎలాంటి ఆపద వచ్చినా తాను అండగా నిలుస్తానని ఆయన స్పష్టం చేశారు. 2025వ సంవత్సరానికి గాను స్వాగతం పలుకుతూ రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త సంవత్సరంలో సగరులు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సగరులు సమష్టిగా ఉండి ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యక్షులు దిండు లోకేశ్, జానకిరాం, ఆవుల రవి, గిరి సాగర్, రాజు సాగర్, అర్జున్, నాగరాజు, సురేందర్, గుంటి కృష్ణ, వెంకటలక్ష్మి, జయమ్మ, పూజ, లావణ్య పాల్గొన్నారు.



కొత్త సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, సగరులు

### కూచిపూడితో అలరించిన శ్రీకావ్య



సిటీబ్యూరో, జనవరి 5(నమస్తే తెలంగాణ): విజయ మాధవి సేవా సాంస్కృతిక అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబురాలు ప్రత్యేక కార్యక్రమం కళాకారులు చేసిన నృత్యాలతో ఆడంబరంగా సాగింది. బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో కృషి నృత్య అకాడమీ నుంచి 16 మంది కళాకారులు పాల్గొన్నారు. ఇందులో భాగంగా చిన్నారి పడికి శ్రీకావ్య చేసిన కూచిపుడి నృత్యం చూపరులను అలరించింది. ఈ కార్యక్రమంలో గురువులు కాంతారావు, నటసాయితో పాటు చిన్నారి కళాకారులు కావ్య, లాస్య, దేదీప్య, నెహృత, శ్రీశిఖ తదితరులు పాల్గొన్నారు.

### హెచ్‌సీయూలో 'మిల్లెట్-ఉతోపియా 2025'

కొండాపూర్, జనవరి 5: ఆహార భద్రత, పోషకాహారం, శక్తి, పర్యావరణ సుస్థిరత కోసం చిరు ధాన్యాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించేందుకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 'మిల్లెట్-ఉతోపియా-2025' ఇంటర్ స్కూల్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలలో నగరంలోని 50 పాఠశాలల్లోని ఎనిమిది నుంచి 10వ తరగతులకు చెందిన 1358 మంది విద్యార్థులు పాల్గొని మిల్లెట్స్ ఫర్ ఫుడ్, న్యూట్రిషన్, ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ థీమ్‌లతో వారు రూపొందించిన అంశాలను ప్రదర్శించారు. పోటీల్లో భాగంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలను నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మైలారం గుట్టపై అనుమతులను వెంటనే రద్దు చేయాలి

### పలువురు పర్యావరణవేత్తలు, వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ హరగోపాల్

చిక్కడపల్లి, జనవరి 5: మైలారం గుట్టపై ఇచ్చిన మైనింగ్ అనుమతులు వెంటనే రద్దు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ప్రజలు జీవించే హక్కును కాపాడాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. మైలారం గుట్ట పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మైలారం గుట్ట పరరిక్షణకై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్, సైంటిస్ట్ డాక్టర్ బాబురావు, ప్రొఫెసర్ లక్ష్మణ్, పౌర హక్కుల సంఘం నేత నారాయణ రావు, పీఓడబ్ల్యూ నేత సంధ్య, కమిటీ అధ్యక్షుడు గుండాల వెంకటేశ్వర్లు తదితరులు హాజరై మాట్లాడారు. మైలారం గుట్టకు చారిత్రక ప్రాధాన్యత ఉందని, గుట్టపై చాలా మంది నిరుపేదలు ఇండ్లు నిర్మించుకొని జీవనం సాగిస్తున్నారని వివరించారు. చుట్టు పక్కల నాలుగైదు గ్రామాలకు ఈ గుట్ట జీవనాధారంగా ఉందని తెలిపారు. జాతీయ పక్షి నెమళ్లు, దుప్పులు, జింకలు, కోతులు వంటి వన్యప్రాణులకు నిలయంగా ఉందని వివరించారు. గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రకృతి, వనం, క్రీడా ప్రాంగణాలను లక్షల రూపాయలు పెట్టి ఈగుట్టపై ఏర్పాటు చేశారని వివరించారు. మైనింగ్ వలన వచ్చే కలుషితమైన గాలితో ఊరులోని చెరువులోని మత్స్య సంపదకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని, గుట్ట చుట్టు పక్కల ఉన్న వ్యవసాయ పొలాలు వ్యవసాయానికి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దిగుబడులు భారీగా తగ్గి రైతులు నష్టాల పాలై అప్పులతో ఆత్మహత్యలు చేసుకునే వరకు వెళ్లే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. 20 ఏండ్ల పాటు మైనింగ్ కోసం ఇచ్చిన అనుమతుల వల్ల ఇక్కడ ప్రజల జీవనం విధ్వంసం జరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణానికి తీవ్ర విఘాతం కలుగడంతో పాటు వాయు, జలాలు కాలుష్యమయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. మైలారం గుట్టపై ఇచ్చిన మైనింగ్ అనుమతులు వెంటనే రద్దుచేయాలని, జీవావరణాన్ని రక్షించాలని వారు డిమాండ్ చేశారు. సమావేశంలో సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, కమిటీ ప్రధాన కార్యదర్శి దేవస్వామి, వీక్షణం ఎడిటర్ వేణు, ప్రజా కళా మండలి జాను, చంద్రమౌళి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శ్రీహరి, శ్రీదేవి, కేఎన్‌పీఎస్ నాయకుడు లక్ష్మీ నారాయణ, జక్క బాలయ్య, సుదర్శన్, శ్రావణ్ పాల్గొన్నారు.

# జర్నలిస్టుల ఉద్యమ స్ఫూర్తి మణికొండ

### పుస్తక పరిచయ సభలో పలువురు వక్తలు



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సంపాదకులు ఎస్.వినయ్ కుమార్

ఖైరతాబాద్, జనవరి 5: జర్నలిస్టులు తమ హక్కుల కోసం ఉద్యమించాలని, అందుకు సీనియర్ జర్నలిస్టు మణికొండ చలపతి రావు స్ఫూర్తిగా నిలుస్తారని వక్తలు అభిప్రాయపడ్డారు. సీనియర్ జర్నలిస్టులు అమరయ్య రచించిన 'భారతీయ జర్నలిజం – ధృవతార మణికొండ చలపతిరావు' పుస్తక పరిచయ కార్యక్రమం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్, నేషనల్ ఎలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్ఏజే) సంయుక్త ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. నేషనల్ అలయెన్స్ ఆఫ్ జర్నలిస్ట్స్ సెక్రటరీ జనరల్ ఎన్.కొండయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రజాశక్తి పూర్వ సంపాదకులు ఎస్.వినయ్ కుమార్, ఎమెస్కో ప్రచురణాలయం సంపాదకులు జి. వల్లీశ్వర్, ఆకాశదర్శన్ ప్రోగ్రాం స్టాఫ్ అసోసియేషన్ నేత వోలేటి గోపీచంద్, ఏపీయుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు, టైమ్స్ ఆఫ్ ఇండియా లీగల్ ఎడిటర్ ఎం.సాగర్ కుమార్, పికాక్ క్లాసిక్స్ సంపాదకుడు ఏ.గాంధీ, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు ఎల్.వేణుగోపాల నాయుడు, సీనియర్ జర్నలిస్టులు పాశం యాదగిరి, నందిరాజు రాధాకృష్ణ, తాడి ప్రకాశ్, మిరియాల వెంకట్రావ్ ఫౌండేషన్ ట్రస్టీ పి.రామ్మోహన్ నాయుడులు మణికొండ చలపతి రావుతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. చలపతి రావు దివంగత ప్రధాని జవాహర్ లాల్ నెహ్రూ పెట్టిన నేషనల్ హెరాల్డ్ పత్రికకు సంపాదకత్వం వహించారన్నారు. నైతిక విలువలు, వృత్తి పట్ల అంకితభావం, పాఠకులకు సులభంగా అర్థమయ్యే రీతిలో రాయడం వంటి లక్షణాలను నేటి జర్నలిస్టులు నేర్చుకోవాలన్నారు. నేటి పత్రికా యాజమాన్యాలు ప్రభుత్వాలకు పూర్తిగా లొంగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చలపతి రావు నేటి జర్నలిస్టు తరానికి స్ఫూర్తినిస్తారని, ప్రస్తుత సంక్షోభ సమయంలో నేటి జర్నలిస్టులు చలపతిరావును ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జర్నలిస్టులకు వేతన బోర్డు రావడం వెనుక చలపతిరావు కృషి అపారమన్నారు. దివంగత జవాహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీలతో ఉన్న పరిచయాన్ని తన సొంతానికి కాకుండా యావత్ జర్నలిస్టుల సంక్షేమానికి పాటు పడ్డారన్నారు. ప్రపంచంలో అత్యధిక పుస్తకాలు చదివిన ప్రముఖుల్లో బ్రిటన్ మాజీ ప్రధాని విన్‌స్టన్ చర్చిల్‌తో పాటు మణికొండ చలపతి రావు ఉన్నారని తెలిపారు.

## వీరశైవ క్యాలెండర్ ఆవిష్కరణ



జగద్గిరిగుట్ట వీరశైవ క్యాలెండర్ ఆవిష్కరణలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

జగద్గిరిగుట్ట, జనవరి 5: ఆధ్యాత్మిక, సేవా రంగాల్లో ముందుండే వీరశైవ సమాజానికి తన సహకారం ఉంటుందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. జగద్గిరిగుట్టలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశానికి కార్పొరేటర్ జగన్‌తో కలిసి అతిథిగా హాజరయ్యారు. బసవేశ్వరుని విగ్రహానికి పూలమాలలు వేసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. రుద్ర అశోక్, వేణు యాదవ్, మల్లికార్జున్, శంకర్, వీరశెట్టి, నాగేంద్రప్ప, రాములు, సంగమేశ్, బస్వరాజ్, సంగమేశ్వర్, బస్వరాజ్, వీరేశం, సుధాకర్ పాల్గొన్నారు.




శంకర్‌పల్లిలో ఇష్టిమా కార్యక్రమం అనంతరం రహదారిపై నిలిచిపోయిన వాహనాలు - ఈ నేపథ్యంలో వాహన చోదకులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు

## ఆకట్టుకున్న ప్రదర్శనలు

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఆదివారం మాదాపూర్‌లోని శిల్పారామంలో పలు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా, న్యూయార్క్ నుంచి విచ్చేసిన కూచిపూడి కళాకారిణి మేఘన ప్రదర్శించిన శివాష్టకం కూచిపూడి నృత్యం, కెనడా, టొరంటోలోని నాట్య కళామంజరి భరతనాట్య అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ వ్యవస్థాపకురాలు సంజీ పిరంతాపం శిష్య బృందం ప్రదర్శించిన భరత నాట్య ప్రదర్శనలు సందర్శకులను ఆద్యంతం ఆకట్టుకున్నాయి. *– కొండాపూర్, జనవరి 5;*



## ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

### మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్




సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్

చిక్కడపల్లి, జనవరి 5: ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని తెలంగాణ మాదిగ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రలో ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆరేపల్లి రాజేందర్ మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణను సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించి అమలు చేయాలన్నారు. వర్గీకరణ వలన భారత రాజ్యాంగం ప్రకారం, అట్టుడుగు వర్గాలకు అందరికీ న్యాయం జరగాలన్నారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ వలన ఒక మాల, మాదిగలే కాకుండా మిగతా అన్ని ఉప కులాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా వర్గీకరణకు మద్దతు ప్రకటించారని పేర్కొన్నారు. దాని అమలుకు కావాల్సిన చర్యలు తీసుకుంటానని చెప్పారని తెలిపారు. వెంటనే ఈ ప్రకియను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫోరం సలహాదారుడు పల్లెల వీరస్వామి, డాక్టర్ చీమ శ్రీనివాస్, భరత్ భూషణ్, సామర్ల కిరణ్, నర్సింగరావు, మొలుగు రాజు, రాంబాబు, గడ్డ యాదయ్య, నర్సింగ్ రావు పాల్గొన్నారు.